• విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన

సమగ్ర శిక్షా అభియాన్, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేజీబీవీల్లో చదివే విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. – రఘునాథపాలెం

దండం పెడతాం.. పాఠాలు చెప్పించండి

పక్షం రోజులు దాటినా చదువులు సాగడం లేదంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ కేజీబీవీ ఎదుట సోమవారం విద్యార్థినులు వినూత్న నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల సమ్మెలో ఉండటంతో బోధించే వారు లేక ఇబ్బంది పడుతున్నట్టు దండం పెడుతూ ఆవేదన వ్యక్తంచేశారు. – చండ్రుగొండ

• సమగ్ర శిక్షా ఉద్యోగుల భిక్షాటన

సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. – రామగిరి

30న క్యాబినెట్ సమావేశం

రైతు భరోసా విధివిధానాలను ఆమోదించే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): క్యాబినెట్ సమావేశం ఈ నెల 30న జరుగనున్నది. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనున్నట్టు సీఎస్ శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో రైతు భరోసా పంపిణీపై విధివిధానాలకు మంత్రిమండలి ఆమోదం తెలుపనున్నట్టు సమాచారం. సంక్రాంతి తర్వాత రైతు భరోసా పంపిణీ ప్రారంభిస్తామని అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో.. 'నూతన సంవత్సర కానుక' పేరుతో క్యాబినెట్ ఆమోదించవచ్చని చెప్తున్నారు. నూతన రేషన్ కార్డుల జారీ విధివిధానాలపైనా చర్చించి, ఆమోదించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

కన్యాకుమారికి సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి సోమవారం తమిళనాడులోని కన్యాకుమారికి వెళ్లారు. కన్యాకుమారి ఎంపీ విజయ్ వసంత్ నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. రాత్రికి అక్కడే బస చేసి.. మంగళవారం ఉదయం తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు.

గృహజ్యోతి సబ్సిడీ 172 కోట్లు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): గృహజ్యోతి పథకం సబ్సిడీని మంజూరుచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. డిసెంబర్ నెలకు రూ.172.58 కోట్లను మంజూరుచేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ భూమి.. బయటి నుంచి సర్కారుదే!

- గేటు తీస్తే లోపలంతా ప్రైవేటు కబ్జా
- బంజారాహిల్స్ స్థలంలో ప్రభుత్వం బోర్డులు
- లోపల ప్రైవేటు వ్యక్తుల పహారా, వేటకుక్కల మోహరింపు
- స్థలంలో ఎక్కడ చూసినా కబ్జాదారుడి పేర్లతో బోర్డులు

ప్రభుత్వస్థలం లోపల ప్రైవేటు వ్యక్తులు

బంజారాహిల్స్, డిసెంబర్ 23: బంజారాహిల్స్‌లోని ప్రభుత్వ స్థలం కబ్జాపై 'నమస్తే తెలంగాణ' వరుసగా ప్రచురిస్తున్న కథనాలతో ఎట్టకేలకు షేక్‌పేట రెవెన్యూ అధికారులు స్పందించారు. మరోవైపు పలువురు రియల్టర్లు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ స్థలం గురించి ఆరా తీయడం ప్రారంభించారు. ఇంకోవైపు ఈ స్థలం కబ్జాకు అండదండలనిచ్చిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు డోలాయమానంలో పడినట్టు తెలుస్తున్నది. ఇంటెలిజెన్స్ వర్గాలనుంచి సమాచారం సేకరించిన ప్రభుత్వ పెద్దలు విస్తుపోయే వాస్తవాలు బయటకు వస్తుండటంతో తగుచర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ప్రైవేటు వ్యక్తులతో జలమండలి, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కయ్యారంటూ వారిమీద నెపం మోపేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మరోసారి సోమవారం ఉదయాన్నే స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం బయట ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. దీంతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటుచేసుకున్న రేకుల గేటు మీద కూడా ప్రభుత్వం స్థలం అని పేర్కొంటూ ఎరుపురంగు మార్కర్‌తో రాశారు. గతంలో రెండుసార్లు రెవెన్యూ సిబ్బంది ఏర్పాటుచేసిన బోర్డులను సదరు ప్రైవేటు వ్యక్తులు తొలగించడంపై తహసీల్దార్ అనితారెడ్డి సైతం సీరియస్ అయినట్టు తెలిసింది.

కొనసాగుతున్న నిర్మాణం?

బంజారాహిల్స్ రోడ్ నం.10 ప్రధాన రహదారిపై సుమారు ఐదెకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్న విషయంపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురిస్తున్న సంగతి తెలిసిందే. పార్థసారథి అనే వ్యక్తి ఫోర్జరీ పత్రాలను సృష్టించి సర్వే నంబర్ 403/52లో తనకు ఐదు ఎకరాల స్థలం ఉన్నట్టు నమ్మిస్తున్నాడు. ప్రభుత్వ పెద్దల సహకారంతో తాత్కాలికంగా అయినా తానే పొజిషన్‌లో ఉన్నట్టు చూపించి నిర్మాణసంస్థ పేరుతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నట్టు ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ మొత్తం వ్యవహారం బయటకు రావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీంతో షేక్‌పేట మండలం సర్వే నంబర్ 403/పీలో టీఎస్‌నెం 1/పార్ట్ బ్లాక్–హెచ్, వార్డు 10లో ఉన్న ప్రభుత్వ స్థలం తమ ఆధీనంలోనే ఉందని సూచిస్తూ.. సోమవారం ఉదయం సైతం బోర్డులు ఏర్పాటు చేసి ఈ వ్యవహారానికి ముగింపు పలికేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ రేకుల ఫెన్సింగ్ లోపల నిర్మాణాలు కొనసాగుతున్నట్టు తెలిసింది.

రౌడీలతో పహారా..కాపలాగా వేటకుక్కలు

ఇదిలా ఉండగా, సదరు కబ్జాకు గురవుతున్న స్థలం బయట రెవెన్యూ సిబ్బంది ఇది ప్రభుత్వ స్థలం అని బోర్డులు పెట్టినా.. లోపల మాత్రం ప్రైవేటు వ్యక్తుల పహారా కొనసాగుతున్నది. సోమవారం ఉదయం ఆ ప్రభుత్వ స్థలం వద్దకు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి వెళ్లగా క్షణాల్లో ముగ్గురు యువకులు చుట్టుముట్టారు. 'ఎవరు మీరు.. ఎందుకు ఇక్కడకు వచ్చారు.. ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఎందుకు ఫొటోలు తీస్తున్నారు?' అంటూ ప్రశ్నలు గుప్పించారు. 'ఇది ప్రభుత్వ స్థలం అని బోర్డు ఉంది కదా.. మీరెవరు?' అని ప్రశ్నించగా.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ బెదిరించారు. ఇంతలో ఓ వ్యక్తి గేటులోంచి తల బయటకు పెట్టి.. తమ బాస్ చెప్పేంతవరకూ ఇక్కడికి ఎవరూ రావద్దని, లోపలకు వెళ్తే ఇబ్బంది పడతారని చెప్పారు. లోపల ఉన్న వేటకుక్కలు ఎవరివి అని ప్రశ్నించగా తమకు తెలియదని, తాము కేవలం డ్యూటీ కోసం ఇక్కడకు వచ్చామని అన్నారు. పక్కనున్న జలమండలికి చెందిన స్థలంలో కొంతమంది దర్జాగా కూర్చుని భోజనాలు తయారు చేస్తుండటం కనిపించింది. రెవెన్యూ సిబ్బంది బయట బోర్డులు పెట్టినా.. రేకుల ఫెన్సింగ్ లోపల మాత్రం నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలిసింది. రెవెన్యూ సిబ్బందిగానీ, జలమండలి అధికారులు కానీ లోనికి వెళ్లే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు కర్రలు, రాడ్లతో గస్తీ కాస్తుంటే పోలీసులకు ఫిర్యాదు చేసి వారిని బయటకు పంపించాల్సిన అధికారులు ఇప్పటిదాకా ఆ పనిచేయకపోవడంపై అనుమానాలు కొనసాగుతున్నాయి. మరోవైపు రాష్ట్రం లో చీమ చిటుక్కుమన్నా ముందుగా తెలిసేది బంజారాహిల్స్‌లో ఇదే ప్రాంతంలో ఉన్న పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు. ఈ భవనంలో నుంచి ఏ కిటికీ అద్దం తీసి చూసినా తమ పక్కనే కబ్జాకు గురైన స్థలంలో కర్రలు, రాడ్లతో తిరిగే వ్యక్తులు, వేటకుక్కలు కనిపిస్తాయి. అయినప్పటికీ పోలీసులు సైతం జోక్యం చేసుకోకపోవడం విస్మయం కలిగిస్తున్నది.

గది నిర్మాణంతో పాటు కరెంట్ మీటర్..

స్థలాన్ని కబ్జా చేశారని భావిస్తున్న పార్థసారథి చాలా ఏండ్ల క్రితమే ఇక్కడ ఓ గదిని నిర్మించడంతోపాటు ఏకంగా విద్యుత్తు మీటర్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అతడు నిర్మించిన గదిని రెవెన్యూ అధికారులు కొంతమేర కూల్చేశారు. మొండిగోడలతో ఉన్న గదిని ఇటీవల తిరిగి నిర్మించుకున్న పార్థసారథి అక్కడ తన స్థలం అంటూ బోర్డులు రాసుకున్నాడు. ఆక్రమించుకున్న స్థలంలో కొండరాళ్ల మీద తన పేరుతో స్థలం ఉన్నట్టు నమ్మించేందుకు సర్వే నెం 403/52 అంటూ పలుచోట్ల రాశాడు. వీటిని చూపిస్తూ బిల్డర్లను నమ్మిస్తున్నాడని, దీనికి రెవెన్యూ, జలమండలి సిబ్బంది సహకరిస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగురోజుల క్రితం ఉన్నతాధికారులు కూడా ఇక్కడకు వచ్చి గదులను ,బోర్డులను తొలగించాలని చెప్పినా ఇప్పటిదాకా వాటిజోలికి పోలేదు.

• ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళన

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం వనపర్తి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. బీఎస్ఎఫ్, బీజీబీఎస్, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. – వనపర్తి టౌన్

• ప్రిన్సిపాల్ తీరుపై నిరసన

క్రిస్మస్ సెలవులకు పిల్లలను ఇంటికి పంపాలని కోరితే ప్రిన్సిపాల్ బీసీ–సీ సర్టిఫికెట్ అడుగుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం వేములవాడలోని బోయిన పల్లి గురుకుల పాఠశాల వద్ద నిరసన తెలిపారు. తాను ఎవరినీ సర్టిఫికెట్ అడగలేదని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. – వేములవాడ

• వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఆదివాసీలందరికీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు తదితరులు పాల్గొన్నారు. – భద్రాచలం

• కలెక్టరేట్ ఎదుట ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల నిరసన

రీజనల్ రింగ్ రోడ్డు కోసం బలవంతంగా భూములు గుంజుకుంటే ఊరుకునేది లేదని భూనిర్వాసితులు హెచ్చరించారు. సోమవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా చేశారు. భూ నిర్వాసితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ భూమికి బదులు భూమి ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. – భువనగిరి కలెక్టరేట్

త్వరలో ఆర్ఆర్ఆర్ టెండర్లు

- యాసంగి పంట రుణాల పంపిణీలో వేగం పెంచండి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ప్రజాభవన్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ పునర్జీవం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఫార్మా కంపెనీలు పెద్ద ఎత్తున రాబోతున్నాయని చెప్పారు. ఆ కోణంలో బ్యాంకర్లు ఆలోచించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచాలని, సకాలంలో రైతులకు రుణాలు ఇవ్వకపోతే ప్రయోజనం ఉండదని చెప్పారు. 2024 వానాకాలం సీజన్‌లో 54,480 కోట్ల రుణాలు లక్ష్యం కాగా 44,438 కోట్లు (81.57 శాతం) విడుదల చేశారని వెల్లడించారు. యాసంగి రుణాల పంపిణీకి నెలరోజుల సమయమే ఉన్నదని, వేగం పెంచాలని కోరారు. టర్మ్ లోన్స్ విషయంలో లక్ష్యానికి మించి పని చేయడం అభినందనీయం ప్రశంసించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలోనూ బ్యాంకర్లు లిబరల్‌గా ఉండాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు శ్రద్ధ చూపాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ పథకాల కోసం, రైతులకు రుణ మాఫీ, ఇతర పథకాల కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నదని భట్టి తెలిపారు. కాబట్టి పెద్ద సంఖ్యలో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

• విలీనాన్ని నిలిపివేయాలని రాస్తారోకో

కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామాన్ని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనాన్ని నిరసిస్తూ సోమవారం గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై చింతకుంట కెనాల్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. – కొత్తపల్లి

నేడు ఇండ్ల నిర్మాణంపై మంత్రి సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్ల పథకం పురోగతిపై మంగళవారం రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హిమాయత్‌నగర్‌లోని గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అర్హులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, గ్రౌండింగ్ తదితర అంశాలపై ఈ సందర్భంగా అధికారులతో చర్చించనున్నారు.

గ్రామగ్రామానా అదే దందా?

- మధ్యమానేరు ముంపు నిర్వాసితులకు పాత పరిహార ప్యాకేజీకి కొత్త దరఖాస్తులు
- విప్ ఆది శ్రీనివాస్ పేరిట దరఖాస్తుల ముద్రణ
- 'స్థానికి' ఓట్ల కోసం కొత్త పన్నాగం
- 'నమస్తే' కథనానికి స్పందన
- ముంపు గ్రామాల్లో నయా దందాపై నిఘావర్గాల ఆరా

వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరిట ముద్రించిన దరఖాస్తు ఫారం

కరీంనగర్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం) ముంపు గ్రామాల్లో కొత్త దందా మొదలైంది. పాత ప్యాకేజీ ఇప్పిస్తామనే పేరుతో కొత్త దరఖాస్తుల స్వీకరణ జాతర ఆరంభమైంది. కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో నడుస్తున్న ఈ వ్యవహారంలో పలువురు ఇప్పటికే హస్తలాఘవం ప్రదర్శిస్తుండగా, ఇంకొన్ని చోట్ల ముందస్తు ఒప్పందాలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే దరఖాస్తుల పేరు తో ఈ వ్యవహారానికి తెరలేపారన్న విమర్శలున్నాయి. మరోవైపు 'మధ్యమానేరు ముంపు గ్రామాల్లో నయాదందా' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం ముంపు గ్రామాల్లో సంచలనం సృష్టించింది. దీనిపై ఇంటెలిజెన్స్, ఎస్‌బీ వర్గాలు ఆరా తీశాయి. కొదురుపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్యాకేజీ కోసం దరఖాస్తులు తీసుకు న్న కాంగ్రెస్ నాయకులు, వారి వివరాలతో కూడిన నివేదికను పైఅధికారులతోపాటు ప్రభుత్వానికి పంపినట్టు తెలుస్తున్నది. మరోవైపు ఈ వ్యవహారంలో తీగలాగితే డొంకంతా కదులుతున్నది.

కాంగ్రెస్ ఆదినుంచీ నిర్లక్ష్యమే

కరీంనగర్ జిల్లాలోని 2.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంలో భాగంగా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద మానేరు వాగుపై 2005–06లో మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర) ప్రాజెక్టుకు పునాది రాయి పడింది. తొమ్మిది గ్రామాలు పాక్షికంగా, మరో తొమ్మిది గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. 2006 ఫిబ్రవరిలో రూ.406 కోట్లకు టెండర్ దక్కించుకున్న జడ్‌వీఎస్–రత్న, సుశీ కంపెనీలు మధ్యలోనే వదిలేశాయి. మళ్లీ 2012లో టెండర్ పిలిచేవరకు దాదాపు పనులన్నీ నిలిచిపోయాయి. 23 ఏప్రిల్ 2012లో నాటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి.. సుదర్శన్‌రెడ్డి పలు పనులకు భూమిపూజ చేసేందుకు ప్రాజెక్టు వద్దకు వచ్చారు. పరిహారం చెల్లింపు విషయంలో అప్పటికే విసిగిపోయిన నిర్వాసితులు వేల సంఖ్యలో ప్రాజెక్టు వద్దకు చేరుకొని.. మంత్రి గ్యో బాక్ అంటూ నినాదాలు ఇవ్వడమే కాకుండా, పరిహారం చెల్లించిన తరువాతే పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. సభా వేదికను కూల్చివేశారు. 2012 జూన్ లోపు అన్ని రకాల పరిహారం చెల్లిస్తామని మంత్రి హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుకు కావాల్సిన నిధులు కేటాయించి నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసింది. పునరావాస ప్యాకేజీ ప్రకారం 2014 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ యువకులకు పట్టా, ప్యాకేజీ అందలేదంటూ విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల వారీగా కలెక్టర్ ఆధ్వర్యంలో సభలు నిర్వహించింది. ఆ మేరకు సుమారు 4,093 దరఖాస్తులు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఊరూరా నయా దందా?

రెవెన్యూ అధికారులు గత దరఖాస్తుల్లో అనర్హులను తిరస్కరించడం.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటం.. ఇదే విధానం కొనసాగితే ముంపు గ్రామాల్లో ఒక్క స్థానం కూడా కాంగ్రెస్‌కు వచ్చే చాన్స్ లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు కొత్త దందాకు తెరలేపారన్న విమర్శలొస్తున్నాయి. అందులో భాగంగానే రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాక పంచాయతీలో దరఖాస్తుల స్వీకరణ జరిగిందని విశ్వసనీయ సమాచారం. అధికారిక పంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు దరఖాస్తులు స్వీకరించడాన్ని 'నమస్తే తెలంగాణ' ఆధారాలతో సహా బయటపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై తీగలాగితే డొంకంతా కదులుతున్నది. దరఖాస్తుల స్వీకరణ కొదురుపాక గ్రామానికి మాత్రమే పరిమితం కాలేదని, ప్రతి ముంపు గ్రామంలోనూ ఇదే దందాను కాంగ్రెస్ నాయకులు నడుపుతున్నట్టు సమాచారం. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరిట ముద్రించి ఉన్న దరఖాస్తులను ఇంటింటా పంపిణీ చేస్తూ.. పూర్తిచేసిన దరఖాస్తును తిరిగి కాంగ్రెస్ నాయకులే సేకరిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక్కడే అనేక అనుమానాలకు దారి తీస్తున్నది. ఒకవేళ అర్హులకు ప్యాకేజీ, పట్టా ఇప్పించే ఉద్దేశం ఎమ్మెల్యేకు, నాయకులకు ఉంటే తిరిగి కొత్తగా దరఖాస్తుల స్వీకరణ ఎందుకు? గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలోనే దరఖాస్తులు స్వీకరించి.. వాటిని పరిశీలన చేసి తుది జాబితాను తయారుచేశారు కదా? వాటిని ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు? అధికారులు సేకరించి, పరిశీలించిన దరఖాస్తులకు విలువ లేదా? అలాంటప్పుడు నేరుగా కాంగ్రెస్ నాయకులు సేకరించిన దరఖాస్తులను ఎలా పరిగణనలోకి తీసుకుంటారు? ఒకవేళ కొత్తగా దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం వస్తే.. ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రజావాణిలకు వెళ్లి దరఖాస్తులు పెట్టుకోవాలని చెప్పాలే తప్ప నేరుగా కాంగ్రెస్ నాయకులు ఎలా సేకరిస్తారు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొంతమంది నాయకులు.. దరఖాస్తులు తీసుకునే సమయంలోనే ప్యాకేజీ వస్తే ఇంత.. పట్టా వస్తే ఇంత శాతం డబ్బులు ఇవ్వాలని ఒప్పందాలు చేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరిట ముద్రించిన దరఖాస్తుల్లోనే వివరాలు నింపాలని చెప్పడమే కాకుండా.. కొంతమంది హస్తలాఘవం ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారాన్ని స్థానిక ఎన్నికల వరకు లాగాలని, తద్వారా ముంపు గ్రామాల్లో ఓట్లు దక్కించుకోవాలని మరికొంతమంది నాయకులు చూస్తున్నారని తెలుస్తున్నది.

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది?

నాటి సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అందులో అర్హులు, అనర్హులను తేల్చే ప్రక్రియను ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులు చేపట్టారు. వచ్చిన దరఖాస్తుల్లో అనర్హులను గుర్తించి, తిరస్కరణకు కారణాలను వివరిస్తూ.. రెవెన్యూ అధికారులు గ్రామాలకు నేరుగా లేఖలు పంపిస్తున్నారు. ఇప్పటికే ఆరెపల్లి, చింతల్‌ఠాణా వంటి గ్రామాల్లో అనర్హులకు లేఖలు అందించారు. వాటిని తీసుకొని, కొంతమంది అనుచరులు కాంగ్రెస్ నాయకుల వద్దకు వెళ్లినట్టు తెలుస్తున్నది. లేఖలు గ్రామాల్లో వస్తే.. స్థానిక సంస్థల్లో ముంపు గ్రామాల్లో ఒక స్థానం కూడా గెలువలేమని, దీనికి ఏదో ఒక పరిష్కారం ఆలోచించాలని పార్టీ శ్రేణులు కోరినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఒక ప్రజాప్రతినిధి జిల్లా స్థాయి ఉన్నతాధికారికి ఫోన్‌చేసి.. 'మీరు ప్యాకేజీ ఇస్తరో లేదో తెలియదు గానీ, ఇలా తిరస్కరణ లేఖలు పంపడం ఆపేయండి. లేదంటే మాకు స్థానిక సంస్థల్లో ఇబ్బంది ఎదురయ్యే అవకాశమున్నది. కొన్నాళ్లు ఈ లేఖలు పంపొద్దు' అని ఆదేశించినట్టు తెలుస్తున్నది. దీంతో సదరు ఉన్నతాధికారి క్షేత్రస్థాయి అధికారులకు లేఖలు పంపొద్దని ఆదేశాలు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

ఆ అమ్మ వారు.. ఈ అమ్మ వారే

- 'నమస్తే' కథనానికి హ్యాష్‌టాగ్
- 'దీపం ఉన్నప్పుడే చక్కబెట్టేద్దాం' కథనాన్నివైరల్ చేసిన హస్తంశ్రేణులు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పోస్టుల్లో పైరవీలు, కాంట్రాక్టర్ల బిల్లుల సెటిల్‌మెంట్లతో ముఖ్యనేతకు సమాంతరంగా నయా పవర్ సెంటర్‌గా మారిన అధిష్ఠానం దూత వ్యవహారంపై కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం రేగింది. పార్టీనే నమ్ముకొని పనిచేసిన అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు దక్కకుండా చేసి, వలస కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పోస్టులు అమ్మకానికి పెట్టడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లోనే తిష్టవేసిన అధిష్ఠానం దూత సమాంతర పాలన సాగిస్తున్న తీరును ఎత్తిచూపుతూ 'దీపం ఉన్నప్పుడే చక్కబెట్టేద్దాం' శీర్షికన 'నమస్తే తెలంగాణ' సోమవారం ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై గాంధీభవన్ వర్గాలతోపాటు ఇంటెలిజెన్స్ పోలీసులు కూడా ఆరాతీసినట్టు తెలిసింది. ఈ కథనాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, దిగువ శ్రేణి నేతలు సోషల్ మీడియాలో వైరల్ చేశాయి. 'కాంగ్రెస్‌ను చంపేస్తారా?' అంటూ గతంలో వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలను దానికి జోడించారు. మరో వర్గం కాంగ్రెస్ శ్రేణులు ఒక వైపు నమస్తే కథనాన్ని, మరోవైపు ఓ కాంగ్రెస్ పార్టీ నేత ఫోటోను పెట్టి 'ఆ.. అమ్మ వారు ఈ..అమ్మ వారే' అంటూ..'దీప ద్యూతం' అనే క్యాప్షన్ పెట్టి సోషల్ మీడియా గ్రూప్‌లోకి వదిలారు. గత నెలలో ఒక ప్రైవేట ఫంక్షన్‌లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. పార్టీలో సీనియర్లమైన తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు . మరోసారి ఆ వ్యాఖ్యలను వైరల్ చేస్తూ 'నమస్తే' కథనాన్ని జోడించారు. ఇదిలా ఉండగా, అధిష్ఠానం దూతలు కొప్పుల రాజు, దీపాదాస్‌మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ తదితరులు సోమవారం గాంధీభవన్‌లో 'అంబేద్కర్ సమ్మాన్ సప్తాహ్' కార్యక్రమం కార్యాచరణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులు అధిష్ఠానం దూతను ప్రశ్నించ